పేదల ఆరాధ్యుడు ఎన్టీఆర్

● రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరాధ్యుడు ఎన్టీఆర్ అని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. బుధవారం ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని శ్రీనివాససెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రజలు ఎదుర్కొనే కష్ట నష్టాలను, అన్యాయాలను, అక్రమాలను ఎన్టీఆర్ గ్రహించి ప్రజలను రక్షించేందుకు టీడీపీని స్థాపించారన్నారు. పేదలకు కనీస వసతులు కల్పించడంలో భాగంగా కూడు, గూడు కల్పించేందుకు కృషి చేశారన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు కిలో రెండు రూపాయల బియ్యం పథకం, వృద్ధులకు ఆసరా పింఛన్లు, జనతా వస్త్రాలు అందించి సమాజంలో గౌరవం కల్పించారన్నారు. మహిళలకు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి రాజకీయ రిజర్వేషన్లు కూడా కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాథరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, రాష్ట్ర కార్యదర్శులు ఏవీఆర్ ప్రసాద్, శ్రీరాములు, పట్టణ అధ్యక్షుడు ఖలీల్, మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, కౌన్సిలర్లు శ్యాంసుందర్‌లాల్, శ్రీదేవి, జైనాబి పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో నిలిచిన మహనీయుడు ఎన్టీఆర్: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, మే 28 (ఆంధ్రజ్యోతి): గొప్ప నటుడిగా ఎన్నో చిత్రాల్లో నటించి రాష్ట్ర ప్రజలకు సేవ చేసేందుకు పార్టీని స్థాపించి అనతికాలంలోనే సీఎం అయి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు ఎన్టీఆర్ అని కలెక్టర్ రాజకుమారి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో మాజీ ముఖ్యమంత్రి, దివంగత నందమూరి తారక రామారావు 102వ జయంతిని నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ తెలుగువారి ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, పర్యాటక శాఖ అధికారి సత్యనారాయణ, నూరన సారస్వత సమితి అధ్యక్షుడు డాక్టర్ గెలివి సహదేవుడు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినోధనమే

అలసిన శ్రమ జీవులకు కాస్తో.. కూస్తో ఆహ్లాదం ఇచ్చేది సినిమా. ప్రస్తుతం సామాన్యులు సినిమా వెళ్లాలంటే జేబులకు చిల్లులు వేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. థియేటర్ల యాజమాన్యాలు నిలువు దోపిడీకి పాల్పడుతున్నాయి. పార్కింగ్ మొదలు, టికెట్ల ధరలు, తినుబండారాలు అన్నింటిని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అయినా పట్టించుకునే వారే కరువయ్యారు. ఒక సామాన్య, మధ్య తరగతి కుటుంబం వారానికి ఓ సినిమా కూడా చూడలేదని దుస్థితి. ఒక కుటుంబం సినిమాకి వెళ్తే తక్కువలో తక్కువ సుమారు రూ.1000 వరకు ఖర్చు పెట్టుకోవాల్సిందే. ఎలాగో అలా సినిమా వెళ్లేందుకు సిద్ధమైన అక్కడ ఉన్న సదుపాయాలను చూసి జడుసుకోవాల్సిందే. భద్రత విషయంలో నిబంధనలకు తూట్లు పొడిచారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఇక అంతే సంగతులు. వీటన్నింటిని పర్యవేక్షించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లాలో సినీ థియేటర్ల దుస్థితిపై 'ఆంధ్రజ్యోతి' కథనం..

- ప్రేక్షకుడి జేబుకు చిల్లు
- అలసిన జీవులకు అందని ఆహ్లాదం
- సినిమా థియేటర్లలో లోపించిన భద్రత
- ఫైర్ పరికరాలు, ఎన్‌వోసీలు లేకుండానే రెన్యువల్స్
- జిల్లాలోని 34 థియేటర్లలో.. కొన్నింటికే అనుమతి
- వాటిలోనూ కనిపించని పరికరాలు
- భయాందోళనలో ప్రేక్షకులు
- కన్నెత్తి చూడని అధికారులు



నంద్యాలలోని ఓ థియేటర్‌లో మరుగుదొడ్ల పరిస్థితి



ఆత్మకూరులో తనిఖీలు చేస్తున్న అధికారులు

నంద్యాల, మే28 (ఆంధ్రజ్యోతి): అలసిన శ్రమజీవులు ఆహ్లాదం కోసం సినిమాకు వెళ్లాలంటే ధనాన్ని విచ్చలవిడిగా ఖర్చు పెట్టాల్సిందే. ఆహ్లాదం రోజురోజుకూ పేద, మధ్య తరగతి ప్రజలకు అందని ద్రాక్షగా మారుతోంది. తినుబండారాలు, కూల్‌డ్రింక్స్ తదితర స్నాక్స్‌ను సైతం అధిక ధరలకు విక్రయించి ప్రేక్షకుల జేబులకు చిల్లు పెడుతున్నారు. ఉపశమనం కోసం ఎంతో హరాషారుగా థియేటర్‌లోకి అడుగుపెడితే ఆయా థియేటర్లలో తలెత్తే అవస్థలు సైతం సినీ ప్రేక్షకులకు సినిమా చూపిస్తున్నాయి. థియేటర్లలో ఏమాత్రం నిబంధనలు పాటించడం లేదు. కనీసం మరుగుదొడ్లు, తాగునీటి, పార్కింగ్ సదుపాయం కూడా సక్రమంగా లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

హంగులను చూపి..

థియేటర్లలో వివిధ హంగులను చూపి అధిక ధరలతో ప్రేక్షకుల జేబులకు చిల్లు పెడు తున్నారు. తినుబండారాల నుంచి పార్కింగ్ మొదలుకొని సినిమా టికెట్ల వరకు అధిక ధరలు ఉన్నాయి. వాటర్ బాటిల్ రూ. 25 నుంచి రూ.40, కూల్ డ్రింక్ రూ. 40 నుంచి రూ.50, పాప్‌కాన్ రూ. 50, కేక్ రూ. 50ల చొప్పున ప్రేక్షకుల నుంచి వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒక కుటుంబం సరదాగా సెలవు రోజున సినిమాకెళ్తే అతడికి తక్కువలో తక్కువ రూ.800 నుంచి 1000 వరకు అవుతోంది, కొత్త సినిమా విడుదల సమయంలో అయితే వాటి ధర మరింత ఎక్కువవుతోంది. దీంతో సామాన్య ప్రేక్షకుడి వినోదం కాస్త పెనుభారంగా మారుతోంది. నిబంధనల ప్రకారం ప్రతి థియేటర్‌లో మూడు క్లాస్‌ల టికెట్‌లు విక్రయించాలి. జిల్లాలో ఎక్కడా కూడా ఈమూడు రకాలు టికెట్‌లు విక్రయిం చడం లేదు. కేవలం మొదటి క్లాస్(రూ.80) డీలాక్స్ (110) మాత్రమే పెట్టారు. పేదల కోసం పెట్టిన రెండో క్లాస్(టికెట్ రూ.30) ఎక్కడా అమలు కావడం లేదు. ఈ విషయంపై అధికారులు కూడా ఏమాత్రం పట్టించుకోలేదు. ఏసీలు సైతం అంతంత మాత్రమే పనిచేస్తున్నాయి.

అగ్ని ప్రమాదం సంభవిస్తే అంతే..

ప్రధానంగా చాలా థియేటర్లలో ఫైర్ సేఫ్టీ పరికరాలు అమర్చలేదు. దీంతో థియేటర్లకు వచ్చే ప్రేక్షకులు భయాందోళన చెందుతున్నారు. ఒకవేళ పొరపాటున అగ్ని ప్రమాదం సంభవిస్తే అంతే సంగతులు. భద్రత విషయంలో యాజమాన్యాలు ఏమాత్రం దృష్టిపెట్టక పోవడం గమనార్హం. వీటిని నియంత్రించాల్సిన అధికారులు సైతం కనీసం ఆవైపు కన్నెత్తి కూడా చూడకపోవడం విడ్డూరం. జిల్లా వ్యాప్తంగా ఉన్న 34 థియేటర్లు ఉండగా. వీటిలో సగానికి పైగా థియేటర్లకు అగ్నిమాపకశాఖ అనుమతి (ఎన్‌ఓసీ) లేవని సమాచారం. మండల, మున్సిపాలిటీ థియేటర్లలోనే కాదు.. జిల్లా కేంద్రంలోని కొన్ని థియేటర్లకు కూడా లేవని సమాచారం. అనుమతులున్నా కూడా పరికరాలు మాత్రం అరకొరగానే అమర్చి చేతులు దులపుకున్నారని ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. ఫైర్‌తో పాటు ఇతర శాఖల అనుమతులు లేకున్నా.. అధికారులు లైసెన్సులు రెన్యూవల్ చేసినట్లు సమాచారం. థియేటర్లలో అగ్నిమాపక ఓజ్‌రీల్స్ పైపుల ఏర్పాటుకు రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు ఖర్చు అవుతుంది. రూ. కోట్లు ఖర్చు చేసి థియేటర్లు నిర్మించే యజమానులు అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేయడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని థియేటర్లలో అయితే మరీ దారుణం. విద్యుత్ తీగలు వేలాడుతూ దర్శనమిస్తుంటాయి. జిల్లాలోని సినిమా థియేటర్ల యజమానులు సైతం ప్రేక్షకుల ప్రాణాలతో ఆడుకుంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

ప్రభుత్వ ఖజానాకు గండి...

కొత్త సినిమా విడుదలైందంటే చాలు బ్లాక్‌లో టిక్కెట్లు విక్రయించి ప్రేక్షకుడిని నిలువు దోపిడీ చేస్తున్నారు. ఆతర్వాత ఆన్‌లైన్ టికెట్స్‌కు మాత్రమే జీఎస్టీ చెల్లించి.. మిగిలిన మాన్యువల్ టికెట్స్‌కు జీఎస్టీ చెల్లించకుండా సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలున్నాయి. కమర్షియల్ ట్యాక్స్ అధికారులు సైతం ఆయా యాజమాన్యాలతో ముడుపులు తీసుకొని ఆవైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఓ వైపు థియేటర్ల యాజమాన్యాలు.. మరో వైపు అధికారులు కలిసి ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు.

నిబంధనలు ఇవే..

● సినిమా థియేటర్ల నిర్మాణ సమయంలోనే అగ్నిమాపక అనుమతులు పొంది ఉండాలి. ఓజ్ రీల్స్, ఎలక్ట్రికల్ మోటర్లు, నాలుగు గంటల పాటు వెలిగే చార్జింగ్ దీపం, ఆటోమెటిక్ సిస్టమ్, హరన్లు, గుర్తించే పరికరాలు అందుబాటులో ఉండాలి.

● 4.5 మీటర్లు ప్రవేశ ద్వారం, థియేటర్‌కు చట్టుపక్కల 6 నుంచి 100 మీటర్ల ఖాళీ ప్రదేశం, టిక్కెట్లు ఇచ్చే ప్రదేశం 2మీటర్లు వెడల్పుగా థియేటర్ లోపల కుర్చీలు వరస మధ్య మీటర్లు దూరం ఉండాలి. 500 చదరపు మీటర్లు ఎత్తు దాటితే భవనానికి రెండు వైపులా మెట్లు ఏర్పాటు చేయాలి.



డోన్ పట్టణంలోని థియేటర్

తప్పనిసరిగా ఉండాల్సినవి..

ప్రతి థియేటర్‌లోనూ అగ్నిమాపక నిరోధక పరికరాలు ఆరు ఉండాలి. తెర ముందు ఇసుక బకెట్లు, నీటి పైపులైను, నీటితో నిండిన డ్రమ్ములు, ట్యాంకు నుంచి కనెక్షను ఉన్న పైపులైను ఇవన్నీ ఉండి ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా రెన్యువల్ చేయించుకోవాలి. ఇలాంటి నిబంధనలు ఎక్కడా పాటించడం లేదు. అధికారులు కూడా పట్టించుకోవడం లేదు.

అనుమతి లేకుండా అడ్డగోలుగా..

జిల్లాలో కొన్నిథియేటర్లు కొత్త సినిమా విడుదల సమయంలో బీ ఫామ్ లైసెన్సు పొందాలి. ఈ లైసెన్సు లేకుండా రెవెన్యూ అధికారులు చిత్ర ప్రదర్శనకు అనుమతి ఇవ్వకూడదు. కొన్ని ప్రాంతాల్లో ఏలాంటి అనుమతి లేకుండా అడ్డగోలుగా సినిమాలను ప్రదర్శించారని సమాచారం. బీ ఫామ్ అనుమతి పొందాలంటే అగ్నిమాపక, విద్యుత్‌శాఖ, రహదారులు, భవనాలు, మున్సిపాలిటీ, పంచాయతీ, పోలీసు, పొల్యూషన్, శానిటరీ శాఖలను అను మతి ఉండాలి. జిల్లాలో ప్రతి మూడేళ్లకు అనుమతులు రెన్యూవల్ చేసుకోవాలి. ఆ దిశగా జిల్లాలో జరగడం లేదని సమాచారం.

ఆన్‌లైన్ చేసి విజయవాడ నుంచే..



ప్రతి థియేటర్ యాజమాన్యం అగ్నిమాపకశాఖ నిబంధనలు పాటించాలి. గతంలో మా వద్దనే రెన్యువల్ చేసేవాళ్లం. 2021లో ఆన్‌లైన్ చేసి విజయవాడ నుంచే అనుమతులు ఇస్తున్నారు. తనిఖీలు చేసే అవకాశం కూడా లేదు. ఉన్నతాధికారుల ఆదేశించినప్పుడు.. ఏదైనా సమస్య వచ్చినప్పుడు మాత్రమే పరిశీలిస్తాం.

\- యోగేశ్వరెడ్డి, ఏడీఎఫ్, జిల్లా అగ్నిమాపకశాఖ

చర్యలు తీసుకుంటాం..



ప్రభుత్వ నిబంధనలు పాటించని థియేటర్లపై తగిన చర్యలు తీసుకుంటాం. అన్ని శాఖల అనుమతి ఉండాల్సిందే. ఎక్కడైనా లేకపోతే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ప్రేక్షకులకు వినోదం భారం కాకూడదు. అధిక ధరలకు విక్రయిస్తే వెంటనే వారిపై చర్యలు తీసుకుం టాం. ప్రేక్షకులు తమకు ఫిర్యాదు చేయాలి.

\- చల్లా విశ్వనాథ్, ఆర్డీవో

వైసీపీ హయాంలో ప్రజాస్వామ్యం ఖూనీ

● మహానాడులో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



బనగానపల్లె, మే 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఒక మీటింగ్ పెట్టుకొని నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం కడప జిల్లాలో నిర్వహించిన మహానాడు సభలో రెండో రోజు ఆయన ప్రసంగించారు. శాంతి భద్రతల పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నో అక్రమ కేసులు ఎదుర్కొని నిద్రలేని రాత్రులు గడిపారన్నారు. టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ యువగళం యాత్రకు అడుగడుగునా ఇబ్బందులు పెట్టారన్నారు. ల్యాండ్ మాఫి యాతో ప్రజల ఆస్తులను వైసీపీ నాయకులు కొల్లగట్టారన్నారు. సోషల్‌మీడియాలో పని చేసే టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారన్నారు. పారిశ్రామికవేత్తలు, కాంట్రాక్టర్లను బెదిరించి రాష్ట్రంలో అభివృద్ధి లేకుండా చేశారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక మహిళలపై నేరాల నియంత్రణకు చట్టాలు తెచ్చామన్నారు. గంజాయి రహిత రాష్ట్రంగా సీఎం చంద్రబాబునాయుడు తీర్చిదిద్దారన్నారు. మూడు దశాబ్దాల క్రితమే రాయలసీమ ఫ్యాక్షన్‌పై చంద్రబాబునాయుడు ఉక్కుపాదం మోపారన్నారు. రాయలసీమలో బాంబుల సంస్కృతికి చెక్ పెట్టడానికి సొంత పార్టీ నేతల విషయంలోనూ ఉపేక్ష చూపించలేదన్నారు.

టీడీపీకి మంత్రి బీసీ రూ.కోటి విరాళం

బనగానపల్లె, మే 28(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమ నిధికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి రూ.కోటి విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు కడపలో జరుగుతున్న మహానాడులో విరాళాన్ని ఇస్తున్నట్లు టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడుకు చెక్కును అందజేశారు. 2014-19 ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యేగా ఎన్నికైన బీసీ జనార్దన్‌రెడ్డి జిల్లా కేంద్రం కర్నూలు టీడీపీ కార్యాలయానికి కూడా రూ.25లక్షలకు పైగా విరాళం అందజేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కడపలో జరుగుతున్న మహానాడులో చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు స్పందించిన బీసీ జనార్దన్‌రెడ్డి కోటి విరాళం అందించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ టీడీపీ కోసం అంకిత భావంతో పనిచేస్తున్న కార్యకర్తల సంక్షేమానికి ఈ విరాళం అందించినట్లు తెలిపారు.

వాన చుక్క.. తప్పుతోంది లెక్క..!

- కర్నూలు జిల్లాలో ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ల నిర్వహణ అస్తవ్యస్తం
- నిరుపయోగంగా 61 ఏడబ్ల్యూఎస్, ఏఆర్‌జీఎస్‌లు
- తహసీల్దారు కార్యాలయాల్లో పాత పద్ధతిలోనే నమోదు
- పక్కాగా లెక్క లేకపోతే రైతులకు నష్టమే



వెల్దుర్తిలో పని చేయని ఏడబ్ల్యూఎస్ సెంటర్

కర్నూలు, మే 28 (ఆంధ్రజ్యోతి): విపత్తులు ఎలా విరుచుకుపడుతాయో.. ఎంతటి నష్టాన్ని మిగులుస్తాయో ఊహించడమే కష్టం. విపత్తు విరుచుకుపడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అందుకే వాతావరణ పరిస్థితులపై నిత్యం పరిశీలన ఉండాలి. ఎప్పుడు ఎక్కడ వర్షాలు పడుతాయి. ఏ ప్రాంతంలో పిడుగులు పడే అవకాశం ఉంది.. తదితర సమాచారం వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తుంది. వర్షపాతం నమోదు, వాతావరణం పరిస్థితులను అంచనా వేసేందుకు కర్నూలు జిల్లాలో ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు 101, ఆటోమెటిక్ రెయిన్‌గేజ్ స్టేషన్లు 58 ఏర్పాటు చేశారు. వివిధ సమస్యలు వల్ల 41 ఏడబ్ల్యూఎస్, 20 ఏఆర్‌జీఎస్‌లు పనిచేయడం లేదు. అస్తవ్యస్తమైన నిర్వహణే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఇప్పటికీ తహసీల్దారు కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన పాతపద్ధతి ద్వారానే వర్షపాతాన్ని లెక్కిస్తున్నారు. దీంతో వర్షపాతం నమోదు కచ్చితత్వంపై నీలినీడలు అలుముకున్నాయి. కీలకమైన వర్షపాతం నమోదులో నిర్లక్ష్యం, నిర్వహణ లోపం రైతులకు శాపంగా మారుతోంది.

భారత వాతావరణ శాఖ (ఏఎండీ), రెవెన్యూ, జలవనరుల శాఖ వర్షపాతం, వాతావరణంలో వస్తున్న మార్పులపై అంచనాలు వేస్తూ ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదికలు చేరవేస్తాయి. ప్రకృతి వైపరీత్యాల వల్ల అన్నదాతలు నష్టపోతే వాతావరణ ఆధారిత పంట బీమా అందాలంటే వర్షపాతం నమోదు అత్యంత కీలకం. అంతేకాదు ఎప్పటికప్పుడు వర్షపాతం నమోదు ద్వారా వేసి ఆయా ప్రాజెక్టులకు చేరే వరదను అంచనా వేసి, ప్రాజెక్టుల రక్షణ కోసం తక్షణ చర్యలు తీసుకుంటారు. వాన చుక్క లెక్క తప్పితే రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిందే. అలాగే జలాశయాలు ప్రమాదంలో పడతాయి. ఇప్పటికీ రెవెన్యూ యంత్రాంగం 1871 నాటి పద్ధతిలో వర్షపాతం నమోదు చేస్తున్నారు. అయితే రాష్ట్ర విభజన తర్వాత టీడీపీ ప్రభుత్వం కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయా మండలాల్లోని వివిధ గ్రామాల్లో 101 ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు (ఏడబ్ల్యూఎస్), 58 ఆటోమేటిక్ రెయిన్‌గేజ్ స్టేషన్లు (ఏఆర్‌జీఎస్) నెలకొల్పారు. సౌరశక్తి ఆధారంగా పని చేసేలా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రణాళిక అభివృద్ధి సంఘం కార్యాలయంతో అనుసంధానం చేయడంతో ఎంత వర్షం కురిసింది, వాతావరణంలో ఎలాంటి మార్పులు చోటుచేసుకున్నాయి.. వంటి వివరాలు ఎప్పటికప్పుడు నేరుగా సదరు వెబ్‌సైట్‌లో నమోదవుతుంది. వీటితోపాటు రెవెన్యూ శాఖ ఏఆర్‌జీఎస్‌లు ద్వారా వర్షపాతం రికార్డులు చేస్తున్నారు. ఇప్పటికీ తహసీల్దారు కార్యాలయాల్లో పురాతన పద్ధతి గాజుసీసా, గరాటులో పడిన వర్షపు చుక్కలను లెక్కిస్తున్నారు. ఎంతోకీలకమైన ఏడబ్ల్యూఎస్, ఏఆర్‌జీఎస్ నిర్వహణలో గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం, నిధులు ఇవ్వకపోవడంతో పలు స్టేషన్లు నిరుపయోగంగా మారాయి.

నిరుపయోగంగా ఏడబ్ల్యూఎస్ స్టేషన్లు

నైరుతి రుతు పవనాలు ముందుగానే రావడం, జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో కూటమి ప్రభుత్వం ఏడబ్ల్యూఎస్, ఏఆర్‌జీఎస్‌లు ఎలా మేరకు పని చేస్తున్నాయో..? తెలుసుకోవడానికి క్షేత్రస్థాయిలో విచారణ చేపడితే విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం, నిర్వహణకు నిధులు ఇవ్వకపోవడంతో పలు స్టేషన్లు నిరుపయోగంగా మారాయి. 101 ఏడబ్ల్యూఎస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే వివిధ కారణాలతో 41 నిరుపయోగంగా మారాయి. 58 ఏఆర్‌జీఎస్‌లకు ఉంటే 20 స్టేషన్లు మరమ్మతులు, నిర్వహణలోపం వల్ల అలంకారప్రాయంగా మారాయి.

వెలుగు చూస్తున్న లోపాలు ఇవి

● ఓర్వకల్లు మండలం శకునాల, ఓర్వకల్లు, కాల్వబుగ్గలో ఏర్పాటు చేసిన ఏడబ్ల్యూఎస్‌లు సాంకేతిక సమస్యలు కారణంగా వర్షపాతం నమోదు చేయడం లేదు. మంత్రాలయం మండలం వగరూరులోని ఏడబ్ల్యూఎస్ విండ్ వేవ్ సక్రమంగా పని చేయడం లేదు.

● కౌతాళం మండలం నదిచాగి, హాల్వి, కౌతాళంలో ఏడబ్ల్యూఎస్‌లు డేటా లాగర్ పని చేయక, బేరోమీటర్ కనిపించకపోవడం, విండ్ వేవ్ విరిగిపోవడంతో సక్రమంగా పని చేయడం లేదు.

మిగతా 4లో...


వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ పుస్తకావిష్కరణ


వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ బుక్ చూస్తున్న అచ్చెన్నాయుడు


వేదికపై ఎమ్మెల్యే ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి


రక్తదానం చేసిన వారికి షీల్డు అందిస్తున్న దృశ్యం


మహానాడులో ప్రత్యేక ఆకర్షణ ఎన్టీఆర్ వేషధారి..







పసుపు జాతర

రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడపగడపలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు జనజాతరను తలపిస్తోంది. రెండోరోజు బుధవారం సైతం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో సందడి నెలకొంది. వందల కిలోమీటర్ల నుంచి యువకులు సైకిళ్లపై వచ్చి టీడీపీపై తమ అభిమానం చాటుకున్నారు. యువతులు, మహిళలు పసుపుచీరలు, పచ్చ తలపాగాలతో సందడి చేశారు. దాదాపు లక్షమందికి భోజన ఏర్పాట్లు చేశారు. 'ఆహో ఏమి రుచి.. తినరా మైమరచి' అంటూ అందరూ భోజనాలను ఆస్వాదించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం'పాదయాత్ర అనుభవాలతో తీసుకొచ్చిన 'వాయిస్ ఆఫ్ నారా లోకేశ్' పుస్తకాన్ని నారా చంద్రబాబు ఆవిష్కరించడంతో కార్యకర్తలు కేరింతలు కొట్టారు. కడప నగరం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో కిటకిటలాడింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.




మంత్రి సవిత ఆధ్వర్యంలో అనంతపురం నుంచి సైకిళ్లపై వచ్చిన కార్యకర్తలు








నోరూరించే వంటలు రెడీ...


మహానాడు ప్రాంగణం వద్ద వాహనాల రద్దీ


అనంతపురం నుంచి సైకిల్ ర్యాలీగా వచ్చిన వారితో మహిళలు


మేము విజిలేస్తే..


కార్యకర్తల ఉత్సాహం..


రక్తదానం చేస్తున్న కార్యకర్తలు


పోలీసు తనిఖీలు

రుధిర రాముడు


దేశెట్టి శ్రీనివాసులు రక్తంతో గీచిన ఎన్టీఆర్ చిత్రం

నందమూరి తారకరామారావు చిత్రాన్ని రక్తం(రుధిరం)తో చిత్రీకరించాడు దేశెట్టి శ్రీనివాసులు. బుధవారం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా నందికొట్కూరుకు చెందిన చిత్రకారుడు శ్రీనివాసులు ఎన్టీఆర్ మీద ఉన్న అభిమానంతో తన రక్తంతో ఆయన చిత్రాన్ని గీచారు.

- నందికొట్కూరు, ఆంధ్రజ్యోతి

వాన చుక్క.. తప్పుతోంది లెక్క

3వ పేజీ తరువాయి


ఆదోని టీబీపీ ఎల్లెల్సీ కార్యాలయం ఆవరణలో ఐఎండీ ఏర్పాటు చేసిన ఆటోమెటిక్ వర్షపాత నమోదు కేంద్రం

దీంతో వాన లెక్క తప్పుతుంది. ఆదోని మండలంలోని గణేకల్లు, కల్లుబావిలో ఏర్పాటు చేసిన ఏడబ్ల్యూఎస్‌లు డేటా లాగర్ పని చేయడం లేదు. పెద్దకడుబూరులోని ఏడబ్ల్యూఎస్ పరిస్థితి కూడా ఇదే. హొళగుందలోని ఏడబ్ల్యూఎస్ టిప్పింగ్ బకెట్‌లో దుమ్ము చేరడంతో వర్షపాతం నమోదు కావడం లే దు.

● గోనెగండ్ల మండలం బి. అగ్రహారం విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఏడబ్ల్యూఎస్‌లో బేరోమీటర్, గ్లోబల్ రేడియేషన్ పరికరాలు అందుబాటులో లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఎమ్మిగనూరు మండలం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం వెనుకాల ఉన్న ఏడబ్ల్యూఎస్‌లో కూడా గ్లోబల్ రేడియేషన్ పరికరం లేదు. మండలం కేంద్రం కోసిగిలో డేటా లాగర్ సక్రమంగా పని చేయడంలేదు.

● చిప్పగిరి మండలం చిప్పగిరి విద్యుత్ సబ్ స్టేషన్‌లోని ఏడబ్ల్యూఎస్‌ను ఆ శాఖ సిబ్బంది తొలగించారు. నగరడోణలో టిప్పింగ్ బకెట్‌లో దుమ్ము చేరి వర్షపాతం నమోదు చేయడం లేదు. ఆలూరు మండలం కమ్మరచేడులో టిప్పింగ్ బకెట్‌లో దుమ్ముపడి వర్షపాతం నమోదు చేయడం లేదు. ఆస్పరి మండలం కైరుప్పలో సోలార్ ప్యానెల్, డేటా లాగర్ దెబ్బ తిని పని చేయడం లేదు.

● దేవనకొండ మండలం ఈదురదేవరబండ ఏడబ్ల్యూఎస్‌కు సక్రమంగా కంచె వేయలేదు. అక్కడ ఏర్పాటు చేసిన సెన్సార్ పని చేయడం లేదు. రెయిన్‌గేజ్ నీరు, దుమ్ముతో నిండిపోయింది. దేవనకొండలో ఎనిమోమీటర్ పాడైపోయింది. రెయిన్‌గేజ్ దుమ్ము, ఇతర చెత్తతో నిండిపోవడంతో వర్షపాతం నమోదు కావడం లేదు. గుండ్లకొండ ఏడబ్ల్యూఎస్ రెయిన్ గేజ్ వంగిపోయింది. నీరు, దుమ్ముతో నిండిపోయింది. హాలహర్వి మండలం గూళ్యం ఏడబ్ల్యూఎస్ టిప్పింగ్ బకెట్‌లో దుమ్ము చేరడంతో వర్షపాతం నమోదు కావడం లేదు.

● తాలుకా కేంద్రం పత్తికొండ ఏడబ్ల్యూఎస్ టిప్పింగ్ బకెట్‌లో దుమ్ము చేరడంతో వర్షపాతం నమోదు కావడం లేదు. విండ్ వేన్ చెడిపోయింది. పందికోనలో ఎనిమోమీటర్, విండ్ వేన్ లేదు. మండల కేంద్రం మద్దికెరలో టిప్పింగ్ బకెట్‌లో దుమ్ముతో నిండిపోవడంతో వర్షపాతం నమోదు కావడం లేదు.

● జిల్లాలో ఏఆర్‌జీఎస్‌లు 58 ఏర్పాటు చేస్తే.. 20 పని చేయడం లేదు. గూడూరు మండలంలో మూడు ఏఆర్‌జీఎస్‌లు చోరీకి గురైయ్యాయి.

ఏడబ్ల్యూఎస్ సేకరించే వాతావరణ వివరాలు

కేంద్ర మార్గదర్శకాలు మేరకు ప్రతి 5 కిలోమీటర్లు విస్తృతి లేదా 7,845 హెక్టార్లకు ఒక ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ (ఏడబ్ల్యూఎస్) ఏర్పాటు చేయాలి. ఏ ప్రాంతంలో ఎంత వర్షం కురిసిందో తెలిస్తే.. అక్కడి నుంచి ఎంత వరద ప్రవాహం వస్తుంది..? ఎటువైపు ప్రవహిస్తుంది..? ఏ నదులు ఉప్పొంగే అవకాశం ఉంది..? ముందే అంచనా వేసి విపత్తుల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేర్చవచ్చు. ఈ కేంద్రాలు ద్వారా వర్షపాతం నమోదుతో పాటు గాలిలో ఉష్ణోగ్రత, గాలిలో తేమ, గాలి వేగం, దిశ, వాతావరణ పీడనం, సూర్యకాంతి సమయం (సౌర వికిరణం) అంచనా వేస్తుంది. ఎప్పటికప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రణాళిక అభివృద్ధి సంఘం వెబ్‌సైట్‌లో నమోదు అవుతుంది.

ఇప్పటికీ పాత పద్ధతే

ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు ఏర్పాటు చేసినా.. నిర్వహణ లోపం కారణంగా రెవిన్యూ అధికారులు పాత పద్ధతిలోనే వర్షపాతం నమోదు చేస్తున్నారు. మండల తహసీల్దారు కార్యాలయాల్లో పని చేసే ఏఎస్‌ఓలు వాన చుక్కలు లెక్కిస్తారు. తహసీల్దారు కార్యాలయం పరిధిలో రెయిన్‌గేజ్‌గా పిలిచే.. అడుగున్నర లేదా రెండడుగులు ఎత్తు ఉండే ఓ డబ్బా, అందులో చిన్నపాటి గాజుసీసా, గరాటు ఉంటుంది.. మిల్లీమీటర్లు, సెంటీమీటర్లు కొలతలు ఉంటాయి. దీని ద్వారా ఏ రోజు ఎంత వర్షం పడిందో లెక్కిస్తారు. ఎంపిక ప్రదేశాల్లో, నిర్ణీత ఎత్తులో రెయిన్‌గేజ్ ఏర్పాటు చేస్తారు. వర్షం కురిసినప్పుడు పైన ఉన్న గరాటు ద్వారా గాజు సీసాలోకి వర్షపు నీరు చేరుతుంది. ఆ నీళ్లు ఎంత ఎత్తున చేరితే అన్ని సెంటీమీటర్లు/మిల్లీ మీటర్లు వర్షం పడిందని అంచనా వేస్తారు. చెట్లు, భవనాలకు సమీపంలో, అటుఇటూ గాలికి మళ్లేలా ఉన్న ఎదుడు దిగుడు ప్రదేశాల్లో ఈ రెయిన్‌గేజ్‌లు ఏర్పాటు చేస్తే తప్పుడు లెక్కలు వస్తాయి. ఇప్పటికీ 1871 సంవత్సరం నాటి పాత పద్ధతి ద్వారానే వాన చుక్కలు లెక్కించడం కొసమెరుపు.

జలవనరుల శాఖ పర్యవేక్షణలో..

జలవనరుల శాఖ గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద జలవనరుల శాఖ ఆటోమేటిక్ ఆల్ వెదర్ స్టేషన్ ఏర్పాటు చేసింది. గంట గంటకు, 24 గంటలకు వర్షపాతం, సోలార్ రేడియేషన్ (సూర్యకాంతి సమయం), గాలి వేగం, విండ్ డైరెక్షన్ గాలి వీచేదిశ, నీటి ఆవిరి, వాతావరణంలో తేమ శాతం అంచనా వేస్తున్నారు. అహ్మదాబాద్‌కు చెందిన అజిస్తా అనే ప్రైవేటు సంస్థ నిర్వహణలో ఉంది. గోరుకల్లు జలాశయం, సుంకేసుల బ్యారేజీ, బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ వద్ద మరో మూడు ఆటోమేటిక్ ఆల్ వెదర్ స్టేషన్లు కొత్తగా ఏర్పాటుకు ఇరిగేషన్ శాఖ శ్రీకారం చుట్టింది.


దేవనకొండలో ఏడబ్ల్యూఎస్ కేంద్రం దుస్థితి

జిల్లాలో ఏడబ్ల్యూఎస్, ఏఆర్‌జీఎస్‌లు పని తీరు ఇలా

కేంద్రాలు	ఏర్పాటు చేసినవి	పని చేస్తున్నవి	పని చేయనివి
ఏడబ్ల్యూఎస్	101	60	41
ఏఆర్‌జీఎస్	58	38	20
మొత్తం	159	98	61

రైతులకు వరం..

అన్నదాత సుఖీభవ పథకం

- జూన్‌లో అమలుకు సిద్ధం
- మహానాడు వేదికపై సీఎం చంద్రబాబు ప్రకటన
- ఉమ్మడి జిల్లాలో 4.50 లక్షల మంది రైతులకు లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



కర్నూలు అగ్రికల్చర్, మే 27 (ఆంధ్రజ్యోతి): రైతుల పాలిట వరంగా అన్నదాత సుఖీభవ పథకం మారనుంది. జూన్ నెలలో రైతుల కోసం ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనుంది. కడపలో జరుగుతున్న మహానాడు వేదికపై సీఎం చంద్రబాబు నాయుడు రైతులకు ఈవరాన్ని ఇచ్చారు. జూన్‌లోనే అమలు చేస్తామని ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని 4.50 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు అవగాహన కల్పించి..

'అన్నదాత సుఖీభవ' కింద అర్హులైన ప్రతి రైతుకు ఏడాదికి రూ.20వేలు సాయం అందిస్తున్నామని ఎన్నికల వేళ చంద్రబాబు హామీఇచ్చారు. దీన్ని జూన్‌లో అమలు చేసేందుకు ఇప్పటికే ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతులకు అవగాహన కల్పించి ఈ పథకం లబ్ధికి రైతు సేవా కేంద్రాల్లో అవసరమైన వివరాలన్నీ సమర్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో భాగంగా గత పది రోజులుగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో అర్హత ఉన్న 4.50 లక్షల మంది రైతుల్లో దాదాపు 90 శాతం మంది రైతులు తమ ధృవపత్రాలను రైతు సేవా కేంద్రాల్లో అందించారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు రైతులు తమ వివరాలను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకుంటున్నారు. ప్రభుత్వం గతంలో ఈ నెల 20 వరకే రైతు సేవా కేం ద్రాల్లో తమ పత్రాలను అందించాలని ఉత్తర్వులు జారీ చేసిం ది. వ్యవసాయ శాఖ యంత్రాంగంతో పాటు రైతుల విజ్ఞప్తి మేరకు ఈ నెల 25 వరకు ప్రభుత్వం గడువును పెంచింది.

రీసర్వే ఇబ్బందులు..

అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు కొంత మంది రైతులకు రీసర్వే ఇబ్బందులు తెచ్చి పెడుతోంది. ఈ సర్వేలో భాగంగా ఏళ్ల తరబడి ఉన్న సర్వేనెంబర్ల స్థానంలో ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్‌పీఎం) తీసుకువచ్చారు. వైసీపీ పుణ్యమా అని రీసర్వే సమయంలో నలుగురు ఐదుగురు రైతులతో కలిపి ఒకే ల్యాండ్ పార్సిల్ మ్యాప్ నెంబరును కేటాయించారు. ఆ మేరకు హక్కు పత్రాలు కూడా అందించారు. అయితే ల్యాండ్ పార్సిల్ మ్యాప్‌లో ఏ రైతు పేరు నమోదు చేస్తే.. మిగలిన రైతుల భూమి విస్తీర్ణం కూడా ఆ రైతు పేరు మీదనే నమోదైంది. ఇలాంటి ఉమ్మడి ఎల్‌పీఎం నెంబర్ అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధి పొందేందుకు అడ్డంకిగా మారిందని వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. ల్యాండ్ పార్సిల్ మ్యాపింగ్ కారణంగా ఒక రైతు పేరును మాత్రమే రికార్డుల్లో ఉండటంతో మిగతా వారికి ఈ పథకం అందించేందుకు కష్టమవుతుందని అధికారులు చెబుతున్నారు. దీంతో పాటు ఆధార్ నెంబర్లు సరిగ్గా లేకపోవడం, మొబైల్ నెంబరు ఆధార్ లింకింగ్ వంటి సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. ఈ అడ్డంకులను వెంటనే పరిష్కరించి అర్హులైన ప్రతి రైతుకు ఈ పథకాన్ని వర్తింపజేసేందుకు చర్యలు చేపట్టాలని రైతులు మొర పెట్టుకుంటున్నారు.

కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ జరిపించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కర్నూలు న్యూసిటీ, మే 28 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని ఆల్కాలిస్ ఫ్యాక్టరీలో నూతన పరిశ్రమ ఏర్పాటు కోసం ప్రజాభిప్రాయ సేకరణ కలెక్టరేట్‌లో నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య భవన్‌లో జిల్లా కార్యదర్శి డి. గౌస్‌దేశాయ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాండ్రపాడులో ఏర్పాటు చేస్తున్న నూతన పరిశ్రమ వల్ల స్థానికులతో పాటు కర్నూలు నగరవాసులు కూడా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఈ నెల 14న ఫ్యాక్టరీ వద్ద ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ అప్రజాస్వామికంగా జరిగిందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ కలెక్టరేట్‌లో నిర్వహించి లైవ్ వీడియో తీయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకుడిపై అక్రమ కేసు బనాయించడం ఎంతవరకు సమంజమసమని ఆయన మండిపడ్డారు. ఫిర్యాదు రాకముందే సీపీఎం నాయకుడు వెంకటేశ్వర్లను బలవంతంగా దొంగతనం కేసు పెట్టి మూడు రోజులపాటు పోలీసుస్టేషన్ చుట్టూ తిప్పడం సరికాదన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే సహించేది లేదన్నారు. నూతన పరిశ్రమలో జరుగుతున్న రసాయనాల గురించి ప్రజలకు వాస్తవాలు చెప్పాలన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు సంతృప్తిగా లేరన్నారు. ఛత్తీస్‌ఘడ్‌లో మావోయిస్టులను పోలీసులు కాల్చిచంపడం హేయమైన చర్య అన్నారు. అదే విధంగా తెనాలిలో యువకులను పోలీసులు నడిరోడ్డుపై కొట్టడం అమానుషచర్యగా భావించాలన్నారు. పోలీసులే శిక్షలు వేస్తే కోర్టులు, మానవ హక్కుల సంఘాలు ఎందుకని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గసభ్యులు కేవి.నారాయణ, రామకృష్ణ, రాముడు, రాధాకృష్ణ, ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

రెండో రోజూ తెలుగు తమ్ముళ్ల జోష్

కడప మహానాడులో ఉమ్మడి జిల్లా శ్రేణులు


అధినేత, సీఎం చంద్రబాబుతో మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్సీ బీటీ నాయుడు


టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్యేలు శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి


విక్టరీ చూపుతున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ



వేదికపై రాజశేఖర్, సుబ్బారెడ్డి, తిక్కారెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, నాగేశ్వరరావు... చంద్రబాబుతో ఎమ్మెల్యే జయనాగేశ్వర్ రెడ్డి

కర్నూలు, మే 28 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు మహా పండుగా భావించే మహానాడు రెండో రోజు బుధవారం ఉమ్మడి కర్నూలు టీడీపీ శ్రేణులు సందడి చేశాయి. కడప జిల్లాలో మహానాడు కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, కీలక నాయకులు పాల్గొన్నారు. పలువురు నాయకులతో కలసి ఫొటోలు తీయించుకున్నారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు పి.తిక్కారెడ్డి, మల్లెల రాజశేఖర్, మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్ధన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, కర్నూలు, నంద్యాల ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, బొగ్గుల దస్తగిరి, కేఈ శ్యాంబాబు, గౌరు చరితారెడ్డి, కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, గిత్తా జయసూర్య, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, భూమా అఖిలప్రియ, ఆదోని, ఆలూరు, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జిలు మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, వీరభద్రగౌడ్, మాధవరం రాఘవేంద్రరెడ్డి, కేడీసీసీబీ చైర్మన్ ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, కురబ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ తదితరులు తమ అనుచరులు, కార్యకర్తలతో మహానాడులో సందడి చేశారు.


టీడీపీ సీనియర్ నాయకుడు తుగ్గలి నాగేంద్ర, ఇతర నాయకులు


చంద్రబాబు కటౌట్‌తో టీడీపీ నాయకులు


మహానాడులో కార్యకర్తలకు ఏర్పాటు చేసిన భోజనశాలను పర్యవేక్షిస్తున్న మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి


మంత్రి టీజీ భరత్


మాజీ ఎంపీ సంజీవ్ కుమార్

బైక్, వాహనం ఢీ.. వ్యక్తి మృతి

ఆదోని రూరల్, మే 28 ఆంధ్రజ్యోతి): బైక్, పండ్ల వాహనం ఢీ కొని ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాల మేరకు.. కౌతాళం మండలం హాల్వి గ్రామానికి మటపతి రాజశేఖర్(45), తన కుమారుడు సిద్దేష్‌కు వేద పవండితుల పరీక్ష రాయించేం దుకు బుధవారం ఆదోని మండలం సంతేకు డ్లూరు గ్రామానికి బైక్‌పై వచ్చారు. పరీక్ష అనంతరం తిరిగి స్వగ్రామానికి బయలు దేరారు. అయితే కుప్పగల్ గ్రామ సమీపంలో వీరికి ముందుగా వెళుతున్న వాహనం స్లో కావడంతో ఓవర్ టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న బొప్పాయి పండ్ల వాహనం వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తండ్రి గుంతలో పడి అక్కడిక్కడే మృతిచెందగా, కుమారుడు సిద్ధేష్‌కు గాయాలయ్యాయి. స్థానికులు ఏరియాసుపత్రికి తరలించారు. పెద్దతుంబళం ఎస్ఐ మహేష్ కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


రాజశేఖర్ (ఫైల్)

విద్యుదాఘాతంతో కౌలు రైతు..

మంత్రాలయం, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసాపురం-52 గ్రామానికి చెందిన పిచ్చిగుంట్ల శంకరన్న (45) అనే కౌలు రైతు పొలంలో విత్తనాలు నాటుతుండగా.. విద్యుత్ షాట్ సర్క్యూట్‌కు గురై మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం జరిగింది. తుంగభద్ర గ్రామానికి చెందిన నవీన్ స్వామికి చెందిన నాలుగెకరాలు శంకరన్న కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటూ జీవిస్తున్నాడు. నాలుగు రోజుల నుంచి వర్షాలు పడుతుండటంతో బుధవారం విత్తనం నాటి బోరు ఆన్ చేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురయ్యాడు. పక్కనే ఉన్న రైతులు, కుటుంబ సభ్యులు ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలోనే మృతి చెందాడు. శంరన్నకు భార్య పార్వతి, ఒక కొడుకు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కేసు నమోదు చేసి రైతు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించినట్లు మాధవరం హెడ్ కానిస్టేబుల్ వీరేష్ తెలిపారు. ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో భార్యా పిల్లలు రోదిస్తున్న దృశ్యం పలువురిని కంట తడి పెట్టించింది.


శంకరన్న(ఫైల్)


వృద్ధుడి ఆత్మహత్య

నంద్యాల టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణ శివారుల్లోని విజయ డెయిరీ వద్ద ఆళ్లగడ్డకు చెందిన దస్తగిరి (70) అనే వ్యక్తి అనారోగ్య సమస్యలతో విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నారు. బుధవారం స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తాలుకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సుపై దుండగుల దాడి..

- ప్రయాణికురాలికి గాయాలు

వెల్దుర్తి, మే 28(ఆంధ్రజ్యోతి): దుండగులు బస్సుపై దాడి చేయడంతో ప్రయాణికురాలు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. ఏపీ40 జడ్ 0612 నెంబరు ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు హైదరాబాద్ నుంచి చిత్తూరు జిల్లా మదనపల్లెకు వెళుతోంది. మార్గమధ్యలో మంగళవారం అర్ధరాత్రి వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లె గ్రామ సమీపంలో బస్సుపై గుర్తుతెలియని దుండగులు గంటతో దాడిచేశారు. దొంగలు దాడిచేశారని భావించిన డ్రైవర్ మల్లిఖార్జున కొంతదూరం తర్వాత బస్సును నిలిపాడు. ఈ దాడిలో బస్సు అద్దాలు ధ్వంసం కాగా, కిటికీ పక్కన కూర్చున్న కదిరికి చెందిన భవిష్య అనే యువతి తలకు గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడ్డ ప్రయాణికురాలు

యువకుడిపై పోక్సో కేసు నమోదు

శిరివెళ్ల, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైన ఘటనలో ఓ యువకుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్నపీరయ్య బుధవారం తెలిపారు. ఈనెల 19వ తేదీ నుంచి బాలిక కనిపించక పోవడంతో తల్లిదండ్రులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

మద్దిలేటి స్వామి హుండీ లెక్కింపు

బేతంచెర్ల, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర హుండీ లెక్కింపు బుధవారం చేపట్టారు. దేవాదాయ శాఖ అధికారి జనార్దన్ సమక్షంలో స్వామి, అమ్మవార్ల హుండీ లెక్కించారు. 62రోజుల కానుకల ద్వారా రూ.67,09,930ల నగదు సమకూరిందని ఈవో తెలిపారు. 40 గ్రాముల బంగారం, 1.9కేజీల వెండి వచ్చినట్లు తెలిపారు. వేద పండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రూ.31 కోట్లకు ఐపీ పెట్టిన గోస్పాడు వాసి

- 88 మందికి నోటీసులు
- కర్నూలుకు చెందిన వ్యాపారికి రూ.5 కోట్ల అప్పు



నంద్యాల టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): గోస్పాడు మండలానికి చెందిన గంగుల వెంకటేశ్వరరెడ్డి అనే వ్యక్తి రూ.31 కోట్లకు ఐపీ పెట్టినట్లు సమాచారం. గతంలో ఆయన రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవాడు. వ్యాపారం బాగుందని చాలా మంది రైతులు, చిన్న వ్యాపారాలు చేసుకునేవారు, నంద్యాల పట్టణం, గోస్పాడు చుట్టు పక్కన ఉన్న పల్లెల వారు కూడా ఆయనకు అప్పులిచ్చారు. అందరి డబ్బులు దండుకుని ఆయన కర్నూలుకు నివాసం మార్చినట్లు సమాచారం. వెంకటేశ్వర రెడ్డి తన వద్ద కేవలం ఇల్లు, కొంత స్థలం ఉందని అప్పులిచ్చిన 88 మందికి ఐపీ నోటీసులు ఇచ్చి టోపి పెట్టాడు. దీంతో బాధితులు ఏమీ చేయాలో అర్థం కానీ పరిస్థితుల్లో ఉన్నారు ఇందులో లాయర్లు, వైద్యులు, న్యాయవాదులు, పట్టణ ప్రముఖులు కూడా ఉన్నారు. కర్నూలుకు చెందిన ఒక వ్యాపారి వద్ద ఏకంగా రూ.5కోట్లు అప్పు తీసుకున్నారు. అలాగే ఒక విశ్రాంత డీఎస్పీ కి రూ.25లక్షలు ఇవ్వాలి. కర్నూలుకు చెందిన మరో వ్యాపారికి రూ.2.75 కోట్లు, పాములపాడుకు చెందిన వ్యాపారికి రూ.1.5 కోట్లు, హైదరాబాద్‌కు చెందిన మరో వ్యాపారికి రూ.1.3 కోట్లు, కోవెలకుంట్లకు చెందిన వ్యక్తికి రూ.1కోటి ఇలా సుమారుగా 88 మంది వద్ద అప్పులు తీసుకుని నోటీసులు ఇచ్చాడు. రూ.50 లక్షల లోపు ఉన్నవారు సుమారుగా 18 వరకు ఉన్నారు. మిలిగిన వారందరూ రూ.2.5 లక్షల నుంచి అప్పులు ఇచ్చారు. కర్నూలులో ఉన్న అతని ఇంటిని నగరానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు అప్పు కింద తీసుకున్నట్లు సమాచారం. గోస్పాడులో ఉన్న 6 ఎకరాల పొలాన్ని ఆళ్లగడ్డకు చెందిన ప్రజాప్రతినిధులు అప్పు కింద తీసుకున్నట్లు సమాచారం. బాధితులు త్వరలో జిల్లా ఉన్నతాధికారులను కలవనున్నట్లు సమాచారం.

గందరగోళంగా పదోన్నతి కౌన్సెలింగ్

- హడావుడి నిర్ణయాలపై స్కూల్ అసిస్టెంట్ల మండిపాటు

నంద్యాల ఎడ్యుకేషన్, మే 28 (ఆంధ్రజ్యోతి): స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్-2 హెచ్ఎంలుగా పదోన్నతి కల్పించే విషయంలో ఉన్నతాధికారుల హడావుడి నిర్ణయాలపై ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సాధారణంగా ప్రధానోపాధ్యాయుల బదీలీలు పూర్తయ్యాక స్కూల్ అసిస్టెంట్లకు 30వ తేదీన గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించాల్సి ఉంది. అయితే పదోన్నతుల లిస్టులో ఉన్న ఎస్ఏలకు మంగళవారం రాత్రి సమచారం ఇచ్చి బుధవారం ఉదయాన్నే హాజరు కావాలని సందేశాన్ని పంపించారు. సుదూరం ప్రాంతాల్లో ఉన్న ఉపాధ్యాయులు హడావుడిగా బుధవారం ఉదయానికి కర్నూలు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి చేరుకున్నారు. తీరా ప్రధానోపాధాయుల బదిలీలు జనరేట్ కాకపోవడంతో గ్రేడ్-2 పదోన్నతులు నిలిచిపోయాయి.

బుధవారం 132 పోస్టులకు గానూ 271 మంది ఉపాధ్యాయులను కౌన్సెలింగ్‌కు పిలిచారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాచిన ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయుల బదిలీలు జనరేట్ కాకపోవడంతో పోస్టుల ఖాళీల సమాచారం లేదని, బుధవారం రాత్రికి జనరేట్ అయితే ఖాళీలను వెంటనే వాట్సాప్ ద్వారా సమాచారం తెలియజేస్తామని అధికారులు వారికి తెలిపారు. అలాగే గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయుల ప్రొవిజనల్ లిస్టులో పేర్లు ఉన్న ప్రతి ఒక్కరూ గురువారం కూడా హాజరు కావాలని, నాట్ విల్లింగ్ ఇచ్చిన వారు కూడా హాజరు కావాలని చెబుతూ వెనక్కి పంపించారు. దీంతో పలువురు ఉపాధ్యాయ, ఉపాధ్యాయ సంఘాలు మండిపడు తున్నాయి.

జిల్లాలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్

- కేంద్ర వ్యవసాయ బృందం 135 గ్రామాల్లో పర్యటన: కేవీకే శాస్త్రవేత్త ధనలక్ష్మి



బనగానపల్లె, మే 28(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా వ్యాప్తంగా వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్, వ్యవసాయ దిగుబడిని పెంచడానికి వ్యవసాయ శాస్త్రవేత్తలను, రైతులను అనుసంధానించే లక్ష్యంతో ఈనెల 29నుంచి జూన్ 12 వరకు 15 రోజుల పాటు జిల్లా అంతటా రైతులతో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్టు, హెడ్ ధనలక్ష్మి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేఖర్లతో మాట్లాడు తూ భారత ప్రభుత్వ వ్యవసాయ మంత్రిత్వశాఖ, భారత వ్యవసాయ పరిశోధన మండలి సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రచారాన్ని రాష్ట్ర వ్యవసాయ, ఇతర విభాగాల మద్దతుతో యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం క్షేత్రస్థాయిలో అమలు చేస్తోందన్నారు. రైతులు ఈ సదస్సుల్లో చురుగ్గా పాల్గొని వ్యవసాయాన్ని మెరుగుప రుచుకోవాలని అన్నారు.

సీమ అభివృద్ధిపై మహానాడులో తీర్మానం చేయాలి

నంద్యాల రూరల్ మే28 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న మహానాడులో రాయలసీమ అభివృద్ధి, సంక్షేమంపై తీర్మానం చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను తెలుగుదేశం ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతూ.. టీడీపీ ప్రజలకిచ్చిన హామీలను నేరవేర్చాలని, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ఒక కీలకమైన దశ, దిశను మహానాడులో ప్రకటించాలని అన్నారు. రాయలసీమకు నీటి వనరులు అందించే హంద్రీ, నీవా, గాలేరు, నగరి సిద్ధేశ్వరం అలుగు, గుండ్రేవుల ప్రాజెక్టులను పూర్తి చేసేలా తీర్మానం చేయాలని కోరారు. అలాగే సీపీఐ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శత జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, ఆగస్టు 22 నుంచి 25 వరకు ఒంగోలులో రాష్ట్ర మహాసభలు, సెప్టెంబర్‌లో 25, 26 వ తేదీల్లో చండీఘర్‌లో జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యవర్గ సభ్యులు రాయచంద్రయ్య, రామాంజనేయులు, జిల్లా నాయకులు రంగనాయుడు, బాబాఫక్రుద్దీన్, ప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చెందొచ్చు

- ప్రభుత్వ ప్రోత్సాహకాలు, రాయితీలను పొందండి
- రాబోయే రోజుల్లో ఉద్యం పోర్టల్‌కు అధిక ప్రాధాన్యం
- జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ అరుణ


మాట్లాడుతున్న జీఎం అరుణ

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్ మే 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యం పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవడంతో భవిష్యత్తులో వ్యాపారులు సైతం పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చెందే అవకాశ ముందని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ అరుణ అన్నారు. బుధవారం కార్యాలయంలో సూక్ష్మ, చిన్న తరహ పరిశ్రమల ప్రతినిధులతో ఉద్యం పోర్టల్‌పై అవగాహన ఏర్పాటుచేశారు. ఉద్యం పోర్టల్‌లో పేర్లను నమోదు చేసుకోవటంతో ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలు, రాయితీలను పొందవచ్చు అన్నారు. కొన్ని సందర్భాల్లో టెండర్లలో పాల్గొనేవారికి ఉద్యం నమోదు ప్రా మాణికంగా, అర్హతగా చూస్తున్నారన్నారు. అందువల్ల సూక్ష్మ, చిన్నతరహ పరిశ్రమల నిర్వాహకులు తమ పేర్లను ఇందులో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వాలు ఉద్యం పోర్టల్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల అభివృద్ధి అధికారి డానియేలు తదితరులు పాల్గొన్నారు.

పెట్నికోటలో ఉద్రిక్తత ..

- గనిలో విద్యుదాఘాతానికి గురైన కార్మికుడు మృతి
- మృతదేహంతో యజమాని ఇంటి ముందు నిరసన
- సీఐ రమేష్‌బాబు జోక్యంతో సద్దుమణిగిన వివాదం

కొలిమిగుండ్ల, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెట్నికోట గ్రామంలో నాపరాతి గనిలో కూలీ పనికి వెళ్లి విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ కార్మికుడు మృతిచెందిన విషయం తెలిసిందే. గని యజమాని నిర్లక్ష్యం కారణంగానే కార్మికుడు బోయ నాగేశ్వరరావు(40) మృతి చెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు బుధవారం నిరసనకు దిగారు. పెట్నికోట గ్రామంలోని గని యజమాని కొండయ్య ఇంటి ముందు మృతదేహాన్ని ఉంచి, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 20న సంఘటన జరిగి, నంద్యాల, కర్నూలు, తిరుపతి ఆసుపత్రుల్లో వారం రోజు లుగా చికిత్సలు పొందుతున్నా, గని యజమాని కనీస సహాయం అందించ లేదని కుటుంబ సభ్యులు ఆవేదన చెందారు. న్యాయం జరిగేవరకు మృత దేహాన్ని తరలించేదిలేదని పేర్కొన్నారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసులు నచ్చజెప్పినా వినకపడంతో సీఐ రమేష్‌బాబు చేరుకొని బాధితులకు నచ్చజెప్పారు. గని యజమానిపై, అతని కుమారుడిపై ఇప్పటికే కేసు నమోదు చేశామని, న్యాయం జరిగేలా చూస్తామని హామీఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహానికి దహనసంస్కారాలు నిర్వహించారు.


బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

ప్రజల గుండెల్లో ఎన్టీఆర్

- తెలుగు ప్రజలకు చేసిన సేవలు మరువలేనివి
- జయంతి వేడుకల్లో కొనియాడిన ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు
- విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి


నందికొట్కూరులో ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు, మే 28(ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి గర్వించే మహోన్నత వ్యక్తి దివంగత నందమూరి తారక రామారావు అని, తెలుగు ప్రజల గుండెల్లో నిలిచారని డీఎస్పీ రామాంజి నాయక్, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు రవీంద్రబాబు, వేణుగోపాల్ అన్నారు. పట్టణంలోని గౌడ్ సెంటర్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అదేవిధంగా భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆత్మకూరు సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ నారాయణ రెడ్డి, నాయకులు శివప్రసాద్‌రెడ్డి, కృష్ణయ్య, గిరిరాజు, బాషా, మల్లికార్జునరెడ్డి, నబీరసూల్, గౌసెలాజం, మోతుల్లా, రామ్మూర్తి, ఎలీషా, దినకర్, శంకరశర్మ, వీరారెడ్డి తదితరులు ఉన్నారు.

- స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి తహసీల్దార్ రత్నరాధిక పూలమాలలు వేసి నివాళి అర్పించారు. డిప్యూటీ తహసీల్దార్ మనోహర్, వీఆర్వోలు ఉన్నారు.

సున్నిపెంట(ఆత్మకూరు): శ్రీశైలం మండలంలోని సున్నిపెంట గ్రామంలో బుధవారం ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వెస్ట్రన్ కాలనీలోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగేళ్ల సురేష్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు ఉమామహేశ్వరరావు, రమణ, మల్లేష్, రమణ, సుబ్బరావు, గుండయ్య, శ్రీను, రమణ, చిన్నబాబు, రాజు, అంజి, యల్లస్వామి, ముంతాజ్, జానబి, పోలమ్మ, బుజ్జి, దుర్గ, శారదమ్మ తదితరులు ఉన్నారు.

బండిఆత్మకూరు: బండిఆత్మకూరులో ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పించారు. కేక్ కట్ చేసి వేడుకలు చేసుకున్నారు. టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు సురేష్‌రెడ్డి, తెలుగుగంగ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ మనోహర్‌చౌదరి, జాకీర్, చలమయ్య, సుబ్బారెడ్డి, ఈశ్వరరెడ్డి, నాగేంద్రారెడ్డి, సాయిబాబారెడ్డి, బాబు, సద్దాం, వెంకటరామయ్య, లక్ష్మీదేవి, లక్ష్మీరెడ్డి, కరీం పాల్గొన్నారు.


ఆత్మకూరులో కేక్ కట్ చేస్తున్న నాయకులు, పోలీసు అధికారులు

మహానంది: మహానంది సమీపంలో ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు కంచెర్ల శివశంకర్ చౌదరి భారీ గజమాలను వేశారు. ఎంపీపీ యశస్విని, టీడీపీ నాయకులు చంద్రమౌళీశ్వరరెడ్డి, నాగపుల్లయ్య, జనార్దన్‌రెడ్డి, రవి నాథరావు, మహేశ్వరరెడ్డి, క్రాంతికుమార్ యాదవ్, వెంకటేశ్వర్లు, కేశవరావు, శివ, మల్లికార్జునరావు, గోపవరం నీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, అస్లాంబాషా, ఉమాదేవి, టీకే సరోజమ్మ పాల్గొన్నారు.

వెలుగోడు: వెలుగోడులోని జలాశయం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. టీడీపీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. టీడీపీ నాయకులు అబ్దుల్‌కలాం, మోమిన్ రసూల్, జాకీర్ హుస్సేన్, మాజీ ఎంపీపీ కృష్ణుడు, రామనాయుడు, భూపాల్‌చౌదరి, హిదాయత్, రఘుస్వామిరెడ్డి, సూరి, సయ్యద్, రాము, సంజీవుడు పాల్గొన్నారు.

నందికొట్కూరు: నందికొట్కూరులోని మున్సిపల్ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. 24వ వార్డు కౌన్సిలర్ చాంద్‌బాషా, టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ రసూల్, కృష్ణ యాదవ్, గోకారి, సత్యనారాయణ, సలాం, పెద్ద శాలిమియా తదితరులు పాల్గొన్నారు.


జూపాడుబంగ్లాలో..

జూపాడుబంగ్లా: ఎంపీడీవో కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎంపీడీవో గోపీకృష్ణ, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, డీటీ నాగన్న, కార్యాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పాములపాడు: పాములపాడులో ఎన్టీఆర్ జయంతిని టీడీపీ నాయకులు గోవిందు, స్వాములు ఏసేపు, అలీబాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు కరీంబాషా, కార్యకర్తలు పాల్గొన్నారు.

పగిడ్యాల: పగిడ్యాలలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో సుమిత్రమ్మ, ఈవోఆర్డీ నాగేంద్రమయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

పాణ్యం: పాణ్యంలోని షాదీఖానాలో టీడీపీ మైనార్టీ విభాగం జిల్లా కార్యదర్శి ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. అడ్వకేట్ విజయకుమార్, నాయకులు సుబ్బయ్య, మాధవి, మహేశ్, కృష్ణ నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- ప్రభుత్వ కార్యాలయాలల్లో ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. డీటీ శివశంకర్ రెడ్డి, ఆర్ఐ రాము, సర్వేయరు నాగరాజు, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బంది ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గడివేముల: మండల కేంద్రంలో టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి ఎన్టీఆర్‌కు నివాళి అర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటరమణ, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వాసుదేవ గుప్తా ఎన్టీఆర్‌కు నివాళి అర్పించారు.

ఎన్టీఆర్ జయంతిని నిర్వహించని తెలుగు తమ్ముళ్లు

కొత్తపల్లి: మండలంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు బుధవారం ఎన్టీఆర్ జయంతిని నిర్వహించలేదు. కనీసం ఆయన చిత్రపటానికి పూలమాలలు కూడా వేయలేదు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండి కడపలో అన్నగారి జయంతిని పురస్కరించుకొని మహానాడు వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. అయితే ఇక్కడ మాత్రం ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించకపోవడం గమనార్హం.


పాములపాడులో..


మహానందిలో..


పాణ్యంలో నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు


గడివేములలో..


బండిఆత్మకూరులో..


సున్నిపెంటలో..


పగిడ్యాలలో..


వెలుగోడులో..

ఆలయ స్వర్ణోత్సవాలు


వడిబియ్యం కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

నంద్యాల కల్చరల్, మే 28(ఆంధ్రజ్యోతి): నంద్యాల సంజీవనగర్ కోదండరామాలయంలో ఆలయ స్వర్ణోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం పుష్పగిరి పీఠాధిపతి జగద్గురు విద్యాశంకర భారతీస్వామి శిష్యబృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భగవత్ సేవాసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం, సాయంత్రం వివిధ పూజలు నిర్వహించారు. 300మంది మహిళలకు వడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. భగవత్ సేవాసమాజ్ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, సభ్యులు పార్థసారధిక్రిష్ణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ

వెలుగోడు, మే 28 (ఆంధ్రజ్యోతి): గుంతకందాల గ్రామంలో గోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నంద్యాల బ్లడ్‌బ్యాంక్ కమిటీ ఆధ్వర్యంలో రకతదాన శిబిరం నిర్వహించారు. సుమారు 150 మంది యువకులు రక్తదానం చేశారు. నంద్యాలకు చెందిన డ్యాన్స్ మాస్టర్ మానస, టీచరు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చిన్నారులు నృత్యాలు అలరించాయి గ్రామ కమిటీ నాయకులు శివన్న వెంకటరమణ, పాపన్న, శ్రీనివాసులు, గురుమూర్తి, సుబ్బరాయుడు, నారాయణపాల్గొన్నారు.

ప్రతిష్ఠాపన వేడుకలు ప్రారంభం

కొత్తపల్లి: పెద్ద గుమ్మడాపురంలో నూతనంగా నిర్మించిన కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం, సాయంత్రం పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చేపల వేటపై చర్యలు: ఎస్ఐ

పాణ్యం, మే (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపనపాడు చెరువులో అక్రమ చేపల వేటపై చర్యలు చేపడుతున్నట్లు పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి తెలిపారు. ఈనెల 28న ఆంధ్రజ్యోతిలో 'భూపనపాడు చెరువులో చేపల దోపిడీ' అన్న శీర్షితో ప్రచురితమైన కథనానికి స్పందించిన పోలీసులు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. చెరువు వద్దకు వెళ్లకూడదని చేపలు పట్టే వారికి హెచ్చరికలు జారీ చేశామని తెలిపారు. అక్రమ చేపల వేటపై పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేశారన్నారు.

వడ్డీ రేట్ కోసం సీల్ టెండర్లు

మహానంది, మే 28 (ఆంధ్రజ్యోతి): మహానంది దేవస్థానికి చెందిన డబ్బును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడం కోసం వడ్డీరేట్లపై దేవదాయశాఖ సీల్ టెండర్ ప్రక్రియ విధానం కోసం వివిధ జాతీయ బ్యాంక్‌లను ఆహ్వానిం చింది. ఇందులో భాగంగా బుధవారం దేవస్థానం ప్రధాన కార్యాల యంలో ఆలయ ఏఈవో మధు చేతుల మీదుగా సీల్ టెండర్ల బాక్స్‌ను తెరిపించారు. ఏపీజీబీ మహానంది శాఖ వడ్డీరేటును 7.90 శాతం అధిక మెత్తం కోడ్ చేసింది. అలాగే నంద్యాల మెయిన్ భారతీయ స్టేట్ బ్యాంక్ బ్రాంచ్ 6.85 శాతం, మహానంది యూనియన్ బ్యాంక్ 7.20 శాతం వడ్డీ రేట్లు ఇవ్వడానికి కోడ్ చేసింది. వీటిని ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి పరిశీలించిన తర్వాత ఆలయానికి చెందిన దాదాపు రూ.40 కోట్ల డిపాజిట్‌లు చేసే నిర్ణయం తీసు కుంటారని ఏఈవో తెలిపారు. ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, బ్యాంక్ మేనేజర్లు హరీష్‌కుమార్, రాఘవ, తిమ్మప్ప, దేవస్థానం క్యాషియర్ నాగభూషణం పాల్గొన్నారు.

రేపు వేలం పాటలు

బండిఆత్మకూరు, మే 28(ఆంధ్రజ్యోతి): బండిఆత్మకూరు జనార్దన స్వామి ఆలయ భూములకు శుక్రవారం ఉదయం 10 గంటలకు కౌలు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈవో ఆకృతి నాగప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత 5 రోజుల క్రితం వేలం పాటలు సరుపగా సరైన వేలం లభించని 17.30 ఎకరాల భూములకు ఈ వేలం పాటలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల రైతులు రూ.1000 ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలని ఈవో తెలిపారు.

మార్కెట్ యార్డు గోడౌన్ల తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి

నంద్యాల నూనెపల్లె, మే 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టెక్కెలో ఉన్న వ్యవసాయ కమిటీ మార్కెట్‌యార్డు గోడౌన్లను ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి బుధవారం తనిఖీ చేశారు. గోదాములోని రికార్డులను ఆమె పరిశీలించారు. పౌరసరఫరాలకు సంబంధించిన రేషన్ వివరాలను అడిగితెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ సాధారణ తనిఖీలో భాగంగా గోదాములోని స్టాక్ పాయింట్లను పరిశీలించినట్లు తెలిపారు.

సినిమా థియేటర్ల తనిఖీ


సినిమా థియేటర్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

ఆత్మకూరు, మే 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సినిమా థియేటర్లను బుధవారం రెవెన్యూ అధికారులు తనిఖీ చేశారు. పట్టణంలోని రంగమహాల్, లక్ష్మీరంగ థియేటర్లలను తహసీల్దార్ రత్నరాధిక పరిశీలించారు. ప్రత్యేకించి మరుగుదొడ్లు, తినుబండారాల విక్రయ కేంద్రాలు, థియేటర్ నిర్వహణను పరిశీలించారు. సినిమా టికెట్ల ధరలు, స్టాల్స్ విక్రయించే తినుబండారాల ధరలను ఆరా తీశారు. వెంట డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, వీఆర్వో నాగభూషణం ఉన్నారు. ఇదిలా వుంటే వీరు థియేటర్ల సందర్శనకు వెళ్లిన సమయంలో ఒక్కో థియేటర్‌లో ముగ్గురు, నలుగురు ప్రేక్షకులు మాత్రమే ఉండటాన్ని చూసి అధికారులు సైతం ఆశ్చర్యపోయినట్లు తెలిసింది.

భిక్షాటన చేస్తూ కూలీల నిరసన

బండిఆత్మకూరు, మే28(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు చేసి ఆరు వారాలైనా కూలీలు అందలేదని, వెంటనే ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు డేవిడ్ అన్నారు. బుధవారం మండలంలోని ఎ.కోడూరు గ్రామంలో ఉపాధి పనుల వద్ద కూలీలు భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే కూలీల సొమ్ము విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విజయ్, సాల్మాన్, నాయుడు, విశ్వాసమ్మ, శాంతమ్మ పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఆత్మకూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రమేష్‌బాబు బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతినెల జరిగే సాధారణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో భాగంగా శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్, ఎక్స్ అఫిషియో సభ్యులు హాజరు కావాలని కోరారు. పలు తీర్మానాలను కౌన్సిల్ దృష్టికి తీసుకురానున్నట్లు చెప్పారు.

రేపటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

పాములపాడు, మే 28 (ఆంధ్రజ్యోతి): పాములపాడులో ఉమ్మడి జిల్లా స్థాయి సమ్మర్ స్పెషల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక ఏఎస్ఆర్ జడ్పీ హైస్కూల్ మైదానంలో శుక్రవారం నుంచి నిర్వహించే ఈ టోర్న మెంట్‌లో గెలుపొందిన జట్లకు మొదటి మూడు బహుమతులు వరుసగా రూ. 30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు అందించనున్నట్లు తెలిపారు. పాల్గొనే జట్టు 9642069665, 7993008692 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

1నుంచి చౌక దుకాణాల్లో రేషన్ పంపిణీ

పాములపాడు, మే 28(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులను వచ్చే నెల 1 నుంచి చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ సుభద్రమ్మ తెలిపారు. బుధవారం పాములపాడులోని తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రేషన్ సరుకులు కొలతలు, తుకాలు సరిగా ఉండాలని, పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. రేషను సరుకులు ప్రతినెల 1 నుంచి 15వ తేది వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు తిరిగి సాయంత్రం 4 గంల నుంచి 8 వరకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి


నంద్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

నంద్యాల హాస్పిటల్, మే 28 (ఆంధ్రజ్యోతి): మహిళలకు నెలసరి సమయంలో పాటించాల్సిన పరిశుభ్రత గురించి మహిళలకు అవగాహన ఉండాలని, జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.సురేష్‌బాబు తెలిపారు. బుధవారం రుతుచక్ర పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకొని నంద్యాలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డా. అంకిరెడ్డి మాట్లాడుతూ నెలసరి సమయంలో మహిళలు, బాలికలు పాటించాల్సిన వ్యక్తిగత పరిశుభ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. డా.శ్రీజ మాట్లాడుతూ ప్రతి నెలా వచ్చే నెలసరి సమయంలో బాలికలు, మహిళలు రోజూ స్నానం చేయాలని, పరిశుభ్రమైన దుస్తులు వాడాలని అన్నారు. కార్యా లయ పర్యవేక్షకుడు గురుస్వామి, హెల్త్ ఆఫీసర్ గుర్రప్ప, శివరాం, సరళగంగ, వెంకటరమణ, జిల్లా కార్యాలయ సిబ్బంది, డైస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మహిళలు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవడం ద్వారా రుతుక్రమ సమస్యలు దూరమవుతాయని వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్ సూచించారు. బుధవారం బైర్లూటి గూడెంలో రుతుక్రమం, ఆరోగ్యం, పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా చెంచు మహిళలకు రుతుక్రమ సమస్యలను ఎలా అధిగమించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలో అవగాహన కల్పించారు. సీహెచ్‌వో దీపిక, హెల్త్ అసిస్టెంట్ బేబి జ్యోతిక పాల్గొన్నారు.


బైర్లూటి గూడెంలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ఘనంగా యోగా డే


నందికొట్కూరులో..


జూపాడుబంగ్లాలో యోగాసనం చేస్తున్న అధికారులు

నందికొట్కూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): 'యోగాంధ్ర'లో భాగంగా పట్టణంలోని అమ్మవారిశాల కల్యాణ మండపంలో ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బేబి మాట్లాడుతూ జూన్ 21వ తేదీ వరకు జరిగే యోగా ప్రత్యేక కార్యక్రమాల్లో ప్రజలంత భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఎంపీడీవో, ఐసీడీఎస్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లాలోని ఆదర్శ పాఠశాల ఆవరణలో బుధవారం 'యోగాంధ్ర'ను నిర్వహించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో గోపికృష్ణ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఉప తహసీల్దార్ నాగన్న, వివిధ శాఖల మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ అధికారులు యోగాలో పాల్గొని ఆసనాలు చేశారు.

కొత్తపల్లి: మండల కేంద్రంలోని వెన్నెల గార్డెన్స్‌లో బుధవారం ఆయూష్ డాక్టర్ జమానుల్లా ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మేరీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజూ యోగా చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. డీటీ పెద్దన్న, ట్రైనర్లు అన్నమ్మ, శైలజ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహానంది: మహానంది మండలంలోని వివిధ గ్రామాల అధికారులతో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆసనాలను చేయించారు. తిమ్మాపురంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ఆవరణలో వివిధ మండల శాఖల అధికారుల చేత యోగసనాలు వేయించారు. ఎంపీడీవో మహమ్మద్ దౌలా మాట్లాడుతూ జూన్ 7వ తేదిన మహానందిలో కలెక్టర్ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగా శిక్షకురాలు వెంకటలక్ష్మి, జడ్పీటీసీ మహేశ్వరరెడ్డి, వైద్యాధికారి భగవాన్‌దాస్, ఎంఈవో రామసుబ్బయ్య, ఎంపీహెచ్‌ఈవో హుసేన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కలువ భాస్కర్ పాల్గొన్నారు.


కొత్తపల్లిలో..


మహానంది: తిమ్మాపురంలో..

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

రేపు సీఎస్ఐ చర్చి ప్రారంభం


ప్రారంభానికి సిద్ధమైన చర్చి

కొలిమిగుండ్ల, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపాడులో నూతనంగా నిర్మించిన సీఎస్ఐ చర్చిని శుక్రవారం ప్రారంభించనున్నట్లు సంఘ పెద్దలు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ సీఎస్ఐ డివిజనల్ చైర్మన్ రెవరెండ్ డాక్టర్ జయకుమార్, చైర్మన్, సీఎస్ఐ చర్చి రెవరెండ్ ఎం.శ్రీదేవి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా కడప సీఎస్ఐ ఆర్డీ బిషప్ రెవరెండ్ డాక్టర్ పెయ్యాల ఐజక్ వరప్రసాద్, ఉమెన్ ఫెలోషిప్ సీడీ భారతి హాజరుకానున్నట్లు వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వ్యాక్సిన్ వేస్తున్న ఏఎన్ఎంలు

చాగలమర్రి, మే 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తల్లిదండ్రులు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూపర్‌వైజర్ రామలింగారెడ్డి అన్నారు. బుధవారం చాగలమర్రి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తొమ్మిదినెలల నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు రుబెల్లా, మిజిల్స్(తట్టు)వ్యాక్సిన్ కార్యక్రమం 30వరకు వేస్తామన్నారు. రెండో విడత జూన్ 23 నుంచి 28 వరకు, జూలై 20 నుంచి 26 వరకు వ్యాక్సినేషన్ చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం 2026 డిసెంబరు నాటికి ఈ వ్యాధులను నిర్మూలించడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

'సిద్దేశ్వరం' సభను జయప్రదం చేయండి

కొవెలకుంట్ల, మే 28 (ఆంధ్రజ్యోతి): సిద్దేశ్వరం వద్ద ఈనెల 31న నిర్వహించనున్న బహిరంగసభను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. బుధవారం పట్టణంలోని కొండారెడ్డి స్మారక గ్రంథాలయంలో విశ్రాంత గ్రంథాలయ అధికారి పల్లె నరసింహారెడ్డి అధ్యక్షతన ప్రజాసంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు సుధాకర్, వెంకటసుబ్బయ్య, నంద్యాల ఓబులేసు, రామచంద్రరాజు, కరీంబాషా, వడ్డె సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

బనగానపల్లె, మే 28(ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు, మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని టంగుటూరు ప్రాథమిక వైద్య కేంద్రం డాక్టర్ శివశంకరుడు అన్నారు. బుధవారం పట్టణంలోని సచివాలయం- 4లో రుతుక్రమం ఆరోగ్య పరిశుభ్రత దినాన్ని నిర్వహించారు. మహిళలకు, కిశోర బాలికలకు రుతుక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సరస్వతి, రమేశ్, నాగలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ ప్రసన్న, ఆశావర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

కాలభైరవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


కలశాల ఊరేగింపులో వేదపండితులు

ఆళ్లగడ్డ మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న కందుకూరు గ్రామంలో వెలసిన కాలభైవర స్వామి ఆలయంలో బుధవారం కాళీ మాత అమ్మవారి కుంభాభిషేకం, ప్రత్యేక పూజలు హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో చతుర్వేద మంత్రయాగ పూర్ణహుతి హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు కలశాలను ఆలయాల వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామిని అభిషేకించారు. అనంతరం స్వామి కల్యాణం కన్నుల పండువగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాది భక్తులు తరలివచ్చారు. హంపీ పీఠాధిపతి భక్తులను ఆశీర్వదించారు. జనసేన ఆళ్లగడ్డ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి, ఇరిగెల రామచంద్రా రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భైరవ స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు పాణ్యం లక్ష్మినరసింహా శాస్త్రి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


హోమం నిర్వహిస్తున్న హంపి పీఠాధిపతి

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

చాగలమర్రి, మే 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి ఉంచాలని డిప్యూటీ ఎంపీడీవో తాహిర్‌హుసేన్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ముందస్తు వర్షాలు కురుస్తుండటంతో గ్రామాల్లో వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారులపై మురుగు నిలిచి ఉంటే దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాలు బారిన పడే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులను క్లోరినైజేషన్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

మూడేళ్లుగా నిరీక్షణ

- అరటి రైతులకు అందని పరిహారం
- మొండి చేయి చూపిన వైసీపీ ప్రభుత్వం
- ఆర్థికంగా చితికిపోతున్న రైతాంగం


పీఆర్‌పల్లిలో ఈదురు గాలులకు దెబ్బతిన్న అరటి

ప్యాపిలి, మే 28 (ఆంధ్రజ్యోతి): అరటి తోటలు నష్టపోయిన రైతులు పరిహారం కోసం మూడేళ్లుగా నిరీక్షిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో ఏటా అరటి తోటలు దెబ్బతింటున్నాయి. రైతులు ఆర్థికంగా చితికిపోతున్నా వైసీపీ ప్రభుత్వం అప్పట్లో పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ఏమి చేయాలో దిక్కుతోచక అరటి రైతులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. మండలంలో దాదాపు 2వేల ఎకరాలు అరటి సాగవుతుంది. చంద్రపల్లి, నల్లమేకలపల్లి, గుడిపాడు, జోయవాండ్లపల్లి, పీఆర్‌పల్లి, వెంకటకొండాపురం, హుసేనాపురం, రాచవాండ్లపల్లి తదితర గ్రామాల్లో రైతులు అధికంగా అరటిని సాగు చేస్తున్నారు. ఎకరాకు దాదాపు రూ.లక్ష పెట్టుబడులు పెట్టి తోటలను సాగు చేస్తున్నారు. అయితే ఏదో రూపంలో పంట దెబ్బతింటుండటంతో అరటి రైతు కుదేలవుతున్నాడు.

ప్రకృతి వైపరీత్యాలు..

ప్రకృతి వైపరీత్యాలు ఏటా అరటి రైతుపై కన్నెర్ర చేస్తున్నాయి. రెండు మూడేళ్లుగా అకాల వర్షాలు, ఈదురుగాలులు నట్టేట ముంచుతున్నాయి. గత ఏడాది, అంతకు ముందు సంవత్సరం కూడా వర్షాలు, పెనుగాలులు బీభత్సానికి మండలంలో వందల ఎకరాల్లో అరటి తోటలు నాశనమమయ్యాయి. ఈఏడాది అదే పరిస్థితి. ఇటీవల కురిసిన వర్షాలకు, ఈదురుగాలులకు వంద ఎకరాలకు పైన అరటి తోటలు నేల కూలాయి.

ధర పతనం..

ఓ వైపు ప్రకృతి వైపరీత్యాలు, మరో వైపు మార్కెట్‌లో ధరలు పతనం కావడంతో అరటి రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారు. పంట సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి రాకపోవడంతో రైతులు అప్పుల పాలవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు అరటి సాగుకు ముందుకు రావడం లేదు.

కూటమి ప్రభుత్వమైనా..

వైసీపీ పాలనలో అరటి రైతుల నష్ట పరిహారం ప్రతి పాదనలకే పరిమితమైందన్న విమర్శలున్నాయి. మూడేళ్లుగా ఏటా ప్రకృతి వైపరీత్యాలకు పంటలు దెబ్బతిన్నా అధికారులు పరిశీలించేది తప్ప చేసిందేమి లేదని అరటి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా దెబ్బతిన్న పంటకు పరిహారం అం దించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు..


మాట్లాడుతున్న ఆర్డీవో విశ్వనాథ్

ఆళ్లగడ్డ, మే 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు పోతోందని నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గం అభివృద్ధిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు మండలాలలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. సమావేశంలో ఎంపీడీవో మహబూబ్‌ఖాన్, తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, అధికారులు, కార్యదర్శులు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు


ఎక్సవేటర్‌తో రోడ్డు మరమ్మతు పనులు

బేతంచెర్ల, మే 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్టాండు సమీపంలో రోడ్డును ఎట్టకేలకు మరమ్మతు చేశారు. ఏడాదిగా పైపులైన్ మరమ్మతుల కోసం నగర పంచాయతీ సిబ్బంది రోడ్డులో గుంత తీసి వదిలేశారు. దాంతో ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కమిషనర్ హరిప్రసాద్‌కు ప్రజలు ఇచ్చిన పిర్యాదు చేశారు. దాంతో కౌన్సిలర్ రామ్మూర్తి గుంతను పూడిపించి రోడ్డు మరమ్మతు పనులును చేయించారు. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

225 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యం

చాగలమర్రి, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో 225 ఎకరాల్లో పండ్ల తోటల సాగుకు లక్ష్యంగా ఉందని ఉపాధిహామీ ఏపీవో ఖాసీంసాహెబ్ తెలిపారు. బుధవారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో టీఏ, ఎఫ్ఏల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పండ్ల తోటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని అన్నారు. రైతుల పొలాల్లో నీటి కుంటలు తవ్వుకునేలా చూడాలని అన్నారు. మస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, ఉపాధి కూలీల సంఖ్య పెంచాలన్నారు. కార్యక్రమంలో ఈసీ, టీఏలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చాగలమర్రి, మే 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మద్దూరు గ్రామానికి చెందిన కానిస్టేబుల్ శేఖర్ కుటుంబానికి టీడీపీ నాయకులు ఆర్థిక సాయం అందించారు. బుధవారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కానిస్టేబుల్ కుటుంబానికి రూ.15 వేలు నగదును సాయం అందించారని గ్రామ నాయకులు వెంకటసుబ్బయ్య, ఓబన్న తెలిపారు. నగదును కుటుంబ సభ్యులకు అందజేశామని అన్నారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, మే 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పశువుల్లో వచ్చే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ అన్నారు. బుధవారం చాగలమర్రి పశువైద్య కేంద్రంలో ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండటంతో గొర్రెలు, మేకలు పారుడు వ్యాధికి గురవుతాయన్నారు. వ్యాధి సోకితే వెంటనే చికిత్సలు చేయించుకోవాలని, నిర్లక్ష్యం చేయరాదని అన్నారు.

పాఠశాలకు విరాళం

రుద్రవరం, మే 28 (ఆంధ్రజ్యోతి): పూర్వవిద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలకు బుధవారం రూ.60వేలు విరాళాన్ని ప్రధానోపాధ్యాయుడు సుబ్బరాయుడుకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2002-07 మధ్య ఆరు నుంచి పదవ తరగతి వరకు కన్యకాపరమేశ్వరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించామన్నారు. పాఠశాలకు తమవంతుగా విరాళాన్ని అందించామన్నారు. రానున్న రోజుల్లో మరింతగా సహకరిస్తామన్నారు.

ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, మే 28 (ఆంధ్రజ్యోతి): రుద్రవరంలోని పడమటివీధిలో కొలువుదీరిన ప్రతాపరుద్ర ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అర్చకులు వారణాసి గోపిశర్మ అభిషేకం చేసి వేద మంత్రోచ్ఛరణల మధ్య పూజలు ప్రారంభించారు. భక్తులు ఆంజనేయుడికి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

31న పింఛన్ల పంపిణీ

బనగానపల్లె, మే 28(ఆంధ్రజ్యోతి): ఈనెల 31న సామాజిక పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఈవోఆర్‌డీ సతీశ్‌రెడ్డి బుధవారం తెలిపారు. జూన్ 1న ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే శనివారం పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు వితంతువులు, ఒంటరి మహిళలు అందుబాటులో ఉండాలని కోరారు.

యోగాసనాలపై శిక్షణ

ప్యాపిలి, మే 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం ఉద్యోగులకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. వచ్చే నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దారు భారతి, ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో పలు ప్రభుత్వశాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి


చాలగమర్రిలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు


డోన్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు


కొలిమిగుండ్ల టీడీపీ కార్యాలయంలో..

చాగలమర్రి, మే 28 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో నందమూరి తారకరామారావు జయంతి వేడుకలను బుధవారం అధికారులు, సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో తాహిర్ హుసేన్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే టీడీపీ కార్యాలయంలో నంద్యాల బీసీసెల్ స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలను నిర్వహించారు.

కొలిమిగుండ్ల : మండలకేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ ప్రచారకార్యదర్శి కోటపాడు శివరామిరెడ్డి, సురేష్‌నాయుడు, నాగకుళ్లాయి, డిష్ గోపాల్, సాయినాథ్‌రెడ్డి తదితరులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

డోన్ రూరల్: పట్టణంలోని తారకరామనగర్‌లోని ప్రధాన సర్కిల్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. నాయకులు టీడీపీ సీనియర్ నాయకులు లక్కసాగరం లక్ష్మిరెడ్డి, శేషిరెడ్డి, శేషఫణిగౌడు, పెద్ద కేశవయ్య గౌడు, రేగటి రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే ఎంఎస్ఆర్ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు ధర్మవరం గౌతమ్ కుమార్ రెడ్డి, డోన్, ప్యాపిలి నాయకులు పాల్గొన్నారు.

కొవెలకుంట్ల: పట్టణంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈవోఆర్‌డీ ప్రకాశ్‌నాయుడు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు కుళాయిబాషా తదితరులున్నారు.

బనగానపల్లె: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంతో ఎంపీడీవో రమణ, ఈవోఆర్‌డీ సతీశ్‌రెడ్డి, సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంజామల: మండల పరిషత్ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీవో సాల్మాన్ పూలమాల వేసి నివాళి అర్పించా రు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రాధికారెడ్డి, ఏవో విజయ్ కుమార్ రెడ్డి, వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

అవుకు : పట్టణంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు ఐ.ఉగ్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దంతెలరమణ, తిక్కన్న, అరుణ్‌కుమార్‌నాయక్, బోయజగన్, పురుకోనశీను, వెంకటేశ్వర్లు, లక్ష్మినారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

రుద్రవరం: తెలుగుగంగ ప్రధాన కాల్వతో రాయలసీమను సస్యశ్యామలం చేసిన ఘనత ఎన్టీఆర్‌దేనని తహసీల్దారు మల్లికార్జునరావు అన్నారు. రెవెన్యూ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. డీటీ చంద్రశేఖరయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

బేతంచెర్ల: తహసీల్దార్, నగర పంచాయతీ కార్యాలయాల్లో ఎన్టీఆర్ చిత్రపటాలకు తహసీల్దార్ ప్రకాష్‌బాబు, కమిషనర్ హరిప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీటీ మారుతి, ఆర్ఐ హేమంత్ కుమార్ రెడ్డి, మేనేజర్ సువర్ణలక్ష్మి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని బేతంచెర్ల గ్రంథాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి గ్రంథాలయ అధికారి మధుశేఖర్, పాఠకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

డోన్ టౌన్: డోన్ పట్టణం ఎన్‌బీకే, ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు నాగేష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కాశీం, ఖాజా హుసేన్, మాలిక్, సాల్మాన్ రాజు, బాలు, జాఫర్ హుసేన్ పాల్గొన్నారు.

ఘనంగా వీర సావర్కర్ జయంతి


వీర సావర్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

బేతంచెర్ల, మే 28 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, రచయిత బహుముఖ ప్రజ్ఞశాలి వీర సావర్కర్ జయంతిని విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం బేతంచెర్లలో అమ్మవారిశాలలో ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి , మండల అధ్యక్షుడు గూని నాగరాజు, బేతంచెర్ల కందగడ్డల రామ్మూర్తి ఎస్ఎస్ఎఫ్ జిల్లా సహ కన్వీనర్ నాగమోహన్, ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు జనార్దన్, మారుతిశర్మ, పుల్లారెడ్డి, శ్రీను, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: పట్టణంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఏపీయూఎస్) కార్యాలయంలో బుధవారం వీర సావర్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. సావర్కర్ చిత్రపటానికి సంఘం అధ్యక్షుడు సంజీవరాయుడు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా బాధ్యుడు విప్రనారాయణ ఆచారి, జిల్లా ఆర్థిక కార్యదర్శి శ్రీపతి, నాయకులు రామాంజనేయులు, మునిమోన్, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

శివరాం థియేటర్ తనిఖీ


థియేటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ నారాయణరెడ్డి

బనగానపల్లె, మే 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివరాం థియేటర్‌ను తహసీల్దార్ నారాయణరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. థియేటర్‌లో ప్రజలకు కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. ముఖ్యంగా టాయ్‌లెట్లు పరిశుభ్రంగా ఉన్నాయా? లేదా? అన్న విషయాలను పరిశీలించారు. థియేటర్‌లో అమ్ముతున్న ఆహార పదార్థాల ధరలు, కూల్ డ్రింక్స్ ధరల గురించి తెలుసుకున్నారు. నివేదికలు ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

'పెద్దమ్మ' చరిత్రను తెలుసుకోవాలి

దొర్నిపాడు, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్ల్యూ. గోవిందిన్నెలో వెలసిన మూలపెద్దమ్మ విశిష్టతపై ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఎరుకలమ్మ వెంకటలక్ష్మమ్మ అన్నారు. జూన్ 8, 9, 10 తేదీల్లో అమ్మవారి దేవరను అత్యంత వైభవంగా జరుపుతున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈనెల 11న అమ్మవారికి ముడుపు కట్టడంతో ప్రతి రోజు ఆలయ ప్రాంగణంలో పెద్దమ్మ విశిష్టత, వైభవం, శక్తి స్వరూపాలను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పెద్దమ్మ దేవర అన్ని ఏర్పాట్లను చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తలారీ శ్రీనివాసులు, మిద్దె శంకరయ్య, చిన్నన్న, చిన్న పెద్దన్న తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో జగదుర్తి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఇండస్ట్రీరియల్ పార్కు ఏర్పాటు చేస్తున్నందున వెల్దుర్తి 33 కేవీ ఫీడర్ లైన్ షిఫ్టు కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ రూరల్ ఏఈ నాగేశ్వరరెడ్డి బుధవారం తెలిపారు. అలాగే జగదుర్తి సబ్ స్టేషన్ పరిధిలోని రైతులకు ఇవ్వాల్సిన త్రీఫేస్ కరెంటు రాత్రి 3 నుంచి ఉదయం 10 గంటల వరకు, సాయంత్రం 5నుంచి 7 గంటల వరకు ఇస్తామన్నారు.

సమయపాలన పాటించండి

రుద్రవరం, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం నరసాపురం, ముత్తలూరు సచివాలయాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. అలాగే ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి సూచించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమీక్షలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పంట వ్యర్థాలకు నిప్పు .. నేలకు ముప్పు

- భూసారం క్షీణించి దిగుబడులు తగ్గిపోతున్న వైనం


కొలిమిగుండ్లలో కంది కొయ్యలను కాల్చివేత

కొలిమిగుండ్ల, మే 28 (ఆంధ్రజ్యోతి) : పంట కోతల అనంతరం వ్యర్థాలకు నిప్పు పెట్టడం తీవ్ర అనర్థాలకు దారి తీస్తుందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. రైతులు ఖరీఫ్ సాగుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో కొందరు రైతులు అవగాహన లేమితో పొలాల్లో కోతల అనంతరం మిగిలిపోయిన అవశేషాలకు నిప్పు పెడుతున్నారు. ఫలితంగా పొగ కాలుష్యం పెరగడంతో పాటు, భూసారం క్షీణించే అవకాశం ఏర్పడుతోంది. ముఖ్యంగా కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు గ్రామాలలో పంటల కోతల అనంతరం మిగిలిన కంది కొయ్యలు, పొగాకు కట్టెలు, వరి కొయ్యలకు నిప్పు పెట్టి కాల్చుతున్నారు. దీంతో నేలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఏర్పడుతోంది. అలా కాకుండా పొలంలోనే కలియ దున్నడం వలన అనేక లాభాలు కలుగుతాయని నిపుణులు సూచిస్తున్నారు. ట్రాక్టర్, రోటోవేటర్‌తో కలియదున్నితే కొయ్యలు, చెత్తా, గడ్డి అంతా మట్టిలో కలిసిపోతుంది. అనంతరం పడిన వానలకు కుళ్లి, భూమిలో సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది. భూమి సారవంతంగా మారి, దిగుబడులు పెరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.